హైస్కూల్ ప్లస్.. విద్యార్థుల్లో జోష్



ఇంటర్ ద్వితీయ, ప్రథమ సంవత్సరం విద్యార్థులతో ఉపాధ్యాయులు



కార్వేటినగరం హైస్కూల్ ప్లస్ బాలికల పాఠశాల

పదో తరగతి తర్వాత పేద, దిగువ, మధ్య తరగతి విద్యార్థినుల్లో డ్రాపౌట్లు ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఆ సంఖ్య మరీ అధికం. ఊరు దాటి ఎక్కువ దూరం ఆడపిల్లలను పంపేందుకు తల్లిదండ్రుల్లో ఉన్న భయాందోళనలే కారణం. గత ప్రభుత్వం ప్రతి మండలానికి కనీసం ఒక్కటి చొప్పున బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. కార్వేటిగనరంలోని బాలికల ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్ ప్లస్‌గా మార్చారు. ఈ ఏడాది విద్యార్థినుల ప్రవేశాలు జోరందుకున్నాయి.

- కార్పొరేట్‌కు దీటుగా ఇంటర్ బోధనలు
- నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులచే టీచింగ్
- బాలికల ఉన్నత పాఠశాలలో పెరుగుతున్న అడ్మిషన్లు

కార్వేటినగరం: మండల పరిధిలో బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన ఆడపిల్లలకు విద్యను మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటైన హైస్కూల్ ప్లస్‌లు మంచి ఫలితాలు రాబడుతున్నాయి. గతేడాది నుంచి బాలికల ఇంటర్ విద్య కోసం హైస్కూల్ ప్లస్‌ను ప్రారంభించారు. పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారు. మన బడి నాడు–నేడు పథకంలో కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేసి, హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. 2022–23 విద్యా సంవత్సరానికి బైపీసీ, సీఈసీ గ్రూపులతో మాత్రమే ప్రారంభించారు.

తొలి ఏడాది 32 మంది చేరిక..

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో తొలి ఏడాదే 32 మంది విద్యార్థులు చేరారు. నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యాబోధనలు చేయడంతో 47 శాతం మంది ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకొచ్చారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో సెకండియర్ బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 32 మంది కొనసాగుతున్నారు. అవసరమైన మేర సిబ్బందిని నియమించడంతో తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగింది.

వేగంగా అడ్మిషన్లు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లో ఉత్తమ మార్కులతో విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించడంతో ఈ ఏడాది ప్లస్‌లో చేరేందుకు విద్యార్థినులు సుముఖత చూపుతున్నారు. ఇటీవల అడ్మిషన్ల కోసం ఎక్కువ మంది వస్తున్నారు. హైస్కూల్ ప్లస్‌కు భవిష్యత్‌లో ఆదరణ బాగుంటుందని సిబ్బంది చెబుతున్నారు. ఒక్కో గ్రూపులో 40 సీట్ల మేరకు ప్రవేశాలు ఉంటాయని, ప్రస్తుతం మొదటి సంవత్సరం బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 16 మంది చేరారని, బుధవారం నాటికి అన్ని సీట్లు పూర్తి అవుతాయని పాఠశాల హెచ్‌ఎం గాయత్రీదేవి చెబుతున్నారు. వీరికి అవసరమైన పాఠ్యపుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుంది.

ఇంటర్‌కు ఆదరణ



హైస్కూల్లో ఇంటర్మీడియెట్ బోధన బాగుంది. గతేడాది ఇంటర్ తరగతులు ప్రారంభించాం. కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాం. హైస్కూల్‌లో చదివిన వారు ఇంటర్‌లో చేరుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందిస్తున్నాం. స్కూల్లో ప్రవేశాలకు ప్రచారం జోరుగా చేస్తున్నాం. ఈ ఏడాది నుంచి బైపీసీ, సీఈసీ గ్రూపులే కాకుండా ఎంపీసీ గ్రూపు ప్రవేశపెడితే బాగుంటుంది.

–గాయత్రీదేవి, హెచ్‌ఎం, బాలికల ఉన్నత పాఠశాల, కార్వేటినగరం

ఆటపాటలతో బోధన



ప్రభుత్వ పాఠశాలల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందిస్తోంది. ఆధునిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. తొలి దశగా కార్వేటినగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ఇంటర్మీడియెట్ విద్యను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. విద్యార్థినుల నుంచి స్పందన బాగుంది.

–విజయకుమార్, ఎంఈఓ, కార్వేటినగరం

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఆంజనేయులు శెట్టి

గంగాధరనెల్లూరు: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న నేను బడికి పోతా అనే కార్యక్రమం ద్వారా బడి ఈడి పిల్లలు బడిలోనే ఉండాలి అంశంపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ ఆంజనేయులు శెట్టి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ నుంచి వచ్చేనెల 12వ తేదీ లోపు మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి అని సూచించారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ప్రతి విద్యార్థికి సంబంధించిన సమాచారాన్ని పొందుపరిచి నూటికి నూరుశాతం 6–14 ఏళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలని ఎంఈఓ అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మండల అభివృద్ధి అధికారి సుధాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని మురకంబట్టులో ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ భార్గవి తెలిపారు. 5–8వ తరగతి వరకు చదివే మైనారిటీ విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయండి



పోలీసులతో సమీక్ష నిర్వహిస్తున్న జడ్జీలు రాఘవేంద్ర, జానకి, గోపాలకృష్ణ

- 29న జాతీయ లోక్‌అదాలత్
- సీనియర్ సివిల్‌జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక క్రిమినల్ కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని సీనియర్ సివిల్‌జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర కోరారు. శనివారం కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసులతో సమీక్ష నిర్వహించారు. జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రధానంగా రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, అన్నిరకాల సివిల్ కేసులను రాజీ చేయాలని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో లేని ప్రీ లిటిగేషన్ కేసులను సైతం లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు. నగదుతో పాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు సైతం తమ పరిధిలోని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అన్నిశాఖల వారు తమ తమ పరిధిలోని కక్షిదారులకు అవగాహన కల్పించడం ద్వారా పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించబడతాయని అన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి వి.గోపాలకృష్ణ, పుత్తూరు డీఎస్పీ వై.శ్రీనివాసరావ్, సీఐలు ఓబులేసు, భాస్కర్‌నాయక్, సత్యబాబు, ఎస్‌ఐలు వెంకటకృష్ణ, రాజకులయప్ప, లక్ష్మీనారాయణ, సెబ్ అధికారులు ఉరుకుందమ్మ, భారతి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



మల్లారెడ్డికండ్రిగలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

విజయపురం: బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలని శ్రీహరిపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జ్ఞానప్రసాద్ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం మల్లారెడ్డికండ్రిగ, ఆదిఆంధ్రవాడ, బుగ్గలవారికండ్రిగ గ్రామాల్లో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకమరాజు ఇంటింటికీ వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని ఉచితంగా అందిస్తారని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమార్, రూబెన్, హరికృష్ణ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.1.80 లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 18 మంది నిందితులకు రూ.1.80 లక్షల జరిమానా విధిసూ్త్ చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 18 మందిపై కేసు నమోదుచేశారు. శనివారం కోర్టులో హాజరుపరచగా, ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. సీఐ నిత్యబాబు మాట్లాడుతూ గత ఏడు నెలల్లో చిత్తూరులో మద్యం తాగి వాహనాలు నడిపిన 223 మందిపై కేసులు నమోదు చేయగా, న్యాయస్థానం దాదాపు రూ.16 లక్షల జరిమానా విధించిందని తెలిపారు. ఇదే తప్పును రెండోసారి చేస్తే రూ.15 వేల జరిమానా, మూడేళ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలను పాటించాలని సూచించారు.

వైభవంగా కలశ స్థాపన పూజలు





శయనాదివాసంలో విసనకర్రతో గాలి విసురుతున్న భక్తులు, ఆలయంలో భక్తుల రద్దీ

నగరి: పట్టణ పరిధిలోని కళింమిట్ట వేల్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మహామునేశ్వర ఆలయ కుంభాభిషేక వేడుకల్లో భాగంగా శనివారం ఆలయ గోపుర కలశ స్థాపన పూజలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రెండవ కాలయాగ పూజ, బింబ ప్రతిష్ఠ, అష్టబంధన సమర్పణం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. శయనాధివాసం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహా మునేశ్వర ప్రతిమకు విసనకర్రలతో గాలివిసిరి మొక్కుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రతిష్ఠకు ముందు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి దీపారాధన చేయగా విచ్చేసిన భక్తులు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కేన్సర్‌పై అవగాహన ఉండాలి





వైద్యసిబ్బందితో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ శిరీష, స్త్రీలకు వైద్య పరీక్షలు చేస్తున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శిరీష

పెనుమూరు(కార్వేటినగరం): కేన్సర్‌పై ప్రజలకు అవగాహన తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ శిరీష అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో కాంప్రహెన్సివ్ కేన్సర్ కేర్ అనే శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలోని వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్, ఏఎన్‌ఎంలకు క్యాన్సర్‌పై ప్రాక్టికల్‌గా ట్రైనింగ్ మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి 30 ఏళ్లు పైబడిన వారికి వివిధ రకాల క్యాన్సర్లపై అవగాహన కల్పించి బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ కేన్సర్‌పై ప్రత్యేకంగా వివరించాల్సిన అవసరం వైద్య సిబ్బందిపై ఉందన్నారు. ఇలాంటి శిక్షణ జిల్లాలో హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో అందరూ విధిగా పాల్గొని అన్ని విషయాలను తెలుసుకుని స్క్రీనింగ్ సర్వే చేసి మెడికల్ కళాశాలలో వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య పరీక్షలను త్వరితగతిన చేయించినట్లయితే బాధితుల జీవిత కాలాన్ని పొడిగించినట్లు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఐఓ డాక్టర్ అనిల్, టీఓలు డాక్టర్ దేవరాజ్, డెంటిస్ట్ డాక్టర్ మీనాసయ్యద్, డాక్టర్ మాధవి, స్త్రీల వైద్య నిపుణులు, స్థానిక డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రేణుక పరమేశ్వరి గ్రామోత్సవం



విశేష అలంకరణలో రేణుక పరమేశ్వరిదేవి గ్రామోత్సవం



మాతమ్మ అమ్మవారి ముగ్గు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు అరుంధతివాడలో జరుగుతున్న మాతమ్మ వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం రేణుక పరమేశ్వరిదేవి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేసి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అదేరోజు ఉదయం ఆలయంలో మాతమ్మ అమ్మవారి బొమ్మను వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణలు, డప్పులు, వాయిద్యాలు, బాణసంచా మెరుపులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

కొండంత రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం అర్ధరాత్రికి తిరుమల పరిసరాలు కిటకిటలాడాయి. అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. ఎక్కడ చూసినా బారులు తీరిన క్యూలే కనిపిస్తున్నాయి. జూన్ 17వ తేదీ వరకు వారాంతపు సెలవుల నేపథ్యంలో రద్దీ నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

- తిరుమల



అఖిలాండం వద్ద భక్తుల రద్దీ



పాపనాశనం రోడ్డు నుంచి వైకుంఠ క్యూ కాంప్లెక్స్ వరకు వేచిఉన్న భక్తులు



ఆస్థాన మండపం వద్ద భక్తుల రద్దీ



నందకం నుంచి పురోహిత సంఘం వరకు భక్తుల నిరీక్షణ



మాడవీధుల్లో భక్తుల కిటకిట

క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో శనివారం హుండీ కానుకల లెక్కింపు జరిగింది. గతేడాది జనవరి 3వ తేదీ నుంచి నేటి జూన్ 15వ తేదీ వరకు రూ.3,41,415 ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ ఈఓ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామయ్య, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

గంగాధరనెల్లూరు: మండలంలోని నీవానది పరివాహక ప్రాంతం సమీపంలో కలిజవేడు రీచ్ నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొట్రకోన ఇసుక రీచ్ వద్ద జ్ఞానేందర్ రెడ్డి అలియాస్ కిరణ్ కుమార్ రెడ్డి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఏఎస్‌ఐ అంజనేయులు రెడ్డి తన సిబ్బందితో కలిసి దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అనంతరం జ్ఞానేందర్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ట్రాక్టర్‌ను సీజ్ చేశామని పోలీసులు తెలిపారు.

ఎస్వీయూలో ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ అండ్ రీసెర్చ్ అనే అంశంపై రెండు రోజులుగా జరిగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పీవీ నరసయ్య ఆధునిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ ప్రాముఖ్యతను వివరించారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎం.పద్మావతమ్మ, సదస్సు కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి, కంప్యూటర్ విభాగాధిపతి జి.అంజాన్ బాబు, ప్రొఫెసర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

అలరించిన రాగసుధ గానామృతం



రాగసుధ బృందం గాత్ర కచేరీ

తిరుపతి కల్చరల్: హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో ఏర్పాటు చేసిన పి.రాగసుధ గాత్ర కచేరీ ఆహూతులను ఆకట్టుకుంది. అన్నమాచార్య సంకీర్తనలను సుమధురంగా గానం చేసి సభికులను మైమరిపించారు.


ఎస్పీడీసీఎల్ ఎస్ఈగా సురేంద్రనాయుడు



సురేంద్రనాయుడు

తిరుపతి రూరల్: ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎఫ్ఏసీ)గా పాలగుడి సురేంద్రనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఆపరేషన్స్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఎస్ఈగా ఉన్న కృష్ణారెడ్డి సెలవులో వెళ్లారు. ఈ నేపథ్యంలో చంద్రగిరి మండలానికి చెందిన సురేంద్రనాయుడు సీఎం చంద్రబాబునాయుడుకు సన్నిహితుడనే పేరుంది. ఆయన సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సురేంద్రనాయుడు ఎస్ఈగా నియమితులు కావడం గమనార్హం.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.